పారదర్శకంగా పనులు చేయాలి

ప్రజాశక్తి - రాజానగరం

గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా ఉపయోగించుకుని, పారదర్శికంగా పనులు చేయాలని సామాజిక తనిఖీ రాష్ట్ర డిప్యూటి డైరెక్టర్ బి.రామారావు అన్నారు. మండలంలో పాతతుంగపాడులో సామాజిక తనిఖీ బృందంతో ఉపాధి హామీ పథకంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ ఏడాది ఈ గ్రామం నుంచి అగాహన కార్యక్రమాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా కూలీలకు ఉపాధికల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ ఎస్‌టిఎం. గౌరీ శంకర్, ఎంపిడిఓ ఎం..సుబ్రమణ్యం, ఎపిడి రాంప్రసాద్, ఎపిఒ జి.వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఉత్తేజంగా...

- 2వ రోజు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ
- ఆకట్టుకున్న అతిథుల ప్రసంగాలు
- పలు తీర్మానాలకు ఆమోదం

కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ రెండోరోజైన గురువారం ఉత్తేజకరంగా సాగాయి. పలువురు ముఖ్యఅతిథుల ప్రసంగాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పోరాట స్ఫూర్తిని నింపాయి. అలాగే పలువురు సౌహార్ద సందేశాలు నూతనోత్సాహాన్ని ఇచ్చాయి. రెండోరోజు పలు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ రెండోరోజు రెట్టింపు ఉత్సాహంతో సాగింది. మొదటి రోజుకు కొనసాగింపుగా రెండోరోజు ఉదయం పలు జిల్లాల ప్రతినిధుల ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా జిల్లాల్లో చేపట్టిన ఉద్యమాలు, ఫలితాలను వివరించారు. ఈ సమయంలో వారు నిర్బంధానికి గురికావడం, జైలుపాలవ్వడం వంటి ఘటనలను ఉదహరించారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి చేసిన కార్యక్రమాలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడారు. తొలుత కష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. విద్యారంగంలో వినాశకర విధానాలు అమలవు తున్నాయన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకున్న తాను 1972-82 మధ్యకాలంలో ఎస్ఎఫ్ఐలో పనిచేసే అనేక సమస్యలపై పోరాడామన్నారు. గుంటూరులో అధ్యాపకునిగా వృత్తి నిర్వహించి మూడో సారి ఎంఎల్‌సిగా పనిచేస్తున్నామన్నారు. ఈ కాలంలో నిబద్ధత, నిజాయితీగా పనిచేస్తున్నానని ఇందుకు ఎస్ఎఫ్ఐ నేర్పిన విలువలే కారణమన్నారు. ప్రజా సమస్యల పట్ల, జీవితంలో విలువలతో ఎలా బతకాలో నేర్పిందన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్, సుభాష్ చంద్రబోస్, సుందరయ్య వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కషి చేస్తుందని కొనియాడారు. విద్యలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ బాగా పెరిగిందన్నారు. కొఠారి కమిషన్ ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని సూచించిందన్నారు. కాని నేడు అలా జరగట్లేదన్నారు. ఎన్ఇపిని వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో వినాశకర సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. పాఠశాలల మెర్జ్‌తో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. వైసిపి అధికారంలో ఒక్క డిఎస్‌సి కూడా తీయలేదన్నారు. యూనవర్శిటీల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎయిడెడ్ కళాశాలలను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నాశనం చేశాయన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ చేపట్టబోయే అన్ని ఉద్యమాలకు పిడిఎఫ్ గా తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని లక్ష్మణరావు ఈ సందర్భంగా తెలిపారు.

16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధుల హాజరు

మహాసభకు 16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 283 మంది ప్రతినిధులు అర్హత పత్రాల ఇచ్చారు. అందులో మండలాల నుంచి 103, టౌన్‌ల నుంచి 85, సిటీల నుంచి 63 మంది, జిల్లా కేంద్ర నుంచి 32 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభకు హాజరైన ప్రతినిధుల్లో అత్యధికంగా 15 నుంచి 18 ఏళ్ల వయస్సు వారు 101 మంది, 19 నుంచి 20 ఏళ్ల వయస్సు వారు 57 మంది, 23 ఏళ్ల లోపు వారు 75 మంది, 25 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు 41 మంది, 30 ఏళ్లకు పైగా ఉన్నవారు ముగ్గురు ఉన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన స్వేచ్ఛ(12 ఏళ్ళు) అత్యంత పిన్నవయస్కురాలు.

సమ్మెకు మద్దతుపై కృతజ్ఞతలు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ తీర్మానం చేసినందుకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని రోడ్డెక్కి అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. వేతనాలు పెంచడానికి డబ్బు లేదని చెబుతున్న పాలకులు, సలహాదారుల పేరుతో పెద్ద ఎత్తున సొమ్ములను దుర్వినియోగం చేయడం లేదా అని ప్రశ్నించారు. ఎన్ఇపి విద్యార్తులకే కాదు అంగన్‌వాడీలకు కూడా నష్టమేనన్నారు. ఎన్ఇపి కారణంగా అంగన్‌వాడీ సెంటర్లను విలీనం చేస్తున్నారన్నారు. ఎన్ఇపికి వ్యతిరేకంగా విద్యార్థులు, అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న పిఎన్ఎం కళారూపాలు

కాకినాడ జిల్లా పెద్దాపురం ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, అప్పన్న, రాంబాబు ఆధ్వర్యంలో ప్రదర్శించిన వివిధ కళారుపాలు ఆకట్టుకున్నాయి. 'ఎక్కడమ్మా నీవు లేనిది..ఏమిటి నీవు చేయలేనిది', 'నా చెమట చుక్కా నా చెమట చుక్కా' అంటూ పిల్లలు ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింపజేసింది. సుమారు గంట పాటు ప్రదర్శించిన "పల్లె సుద్దులు" ఉత్సాహంగా సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు పెంచి ప్రజలను ఎలా మోసాగిస్తున్నాయో, బిజెపి సర్కారు విద్యలో కాషాయీకరణను తీసుకొస్తూ విద్యా రంగాన్ని ప్రమాదంలో ముంచెత్తుతున్న విధానాన్ని వివరించారు. ఓటు హక్కు విలువను తెలియజేస్తూ పల్లె సుద్దులు చెప్పారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు అమృత, సమ్రత, పూజిత, అఖిల, నిఖిల, ధరణి, అరుణ్ బంగారు రాజు,గౌస్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పిఎన్ఎం కళాకారులు పల్లెసుద్దులు

నాయకులు సంఘీభావం

29, 30 తేదీల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా పరిధిలో ఎపిపిఎస్‌సి ద్వారా శాఖ పరమైన పరీక్షలను డిసెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ జి. నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆబ్జెక్టివ్ మరియు కన్వెన్షనల్ విధానంలో డిసెంబర్ 29, 30 తేదీల్లో ఎపిపి ఎస్‌సి ద్వారా శాఖా పరమైన పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్స్‌లో నిర్వహిస్తున్న శాఖాపరమైన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తోపాటు, ప్రభుత్వం గుర్తించి అసలు ఫోటో గుర్తింపు కార్డుతో పరీక్ష ప్రారంభించడానికి అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించవలసి ఉంటుందని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించడం జరగదని తెలిపారు. ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షలు ఉదయం పరీక్ష 10.00 నుంచి ఉ 12.00 వరకు, మధ్యాహ్నం 3.00 నుంచి 5.00 గంటల వరకు నిర్వహిస్తామని అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి అనుమతించడం జరుగుతుందని, మధ్యాహ్నం 3.00 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తామని అభ్యర్థులను మధ్యాహ్నం 2.00 నుంచి అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే వారం రోజులు ముందే హాల్ టికెట్స్ అభ్యర్థులకు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ పి.గిరిజరాణి, ఎఎస్ఒ కెఎస్ఎస్.అనిల్‌కుమార్, డిఎస్‌పి డి. రామవర్మ, ఎంపిహెచ్ఒ పి.జాన్సన్‌రాజు, విద్యుత్ శాఖ డిఇఇ ఎస్.దేవయ్య, సిఎస్ ఎస్‌వి.గణేష్, సిఎస్‌డిటి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి

-కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నాలో డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని విఆర్ఎలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విఆర్ఎలు కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ధర్నా అనంతరం కలెక్టర్ కె.మాధవీలతకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లిమొగ్గల.వెంకట రమణ, ఎస్‌కె.రెహ్మాన్ మాట్లాడారు. విఆర్ఎలకు పే స్కేల్‌ను వర్తింప చేయాలని, నామినీలుగా పని చేస్తున్నవారిని రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తుంచాలని, ఖాళీగా ఉన్న విఆర్ఒ, వాచ్‌మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, జీపు డ్రైవర్ పోస్టులలో 30 శాతం ఉన్న శాతాన్ని 70 శాతానికి పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 500 డిఎ ను 2018 జూన్ నుంచి వేతనంతో కూడిన డిఏగా తక్షణమే ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన డిఎను సైతం జగన్ ప్రభుత్వం ఒక్కొక్కరి నుంచి రూ.100, 500 రికవరీ చేసి విఆర్ఎల కడుపును కొట్టిందని తెలిపారు. ఎన్నికల ముందు రూ.15 వేలు వేతనం ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ సిఎం అయ్యాక హామీ సంగతిని గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి భగత్, సంఘం జిల్లా నాయకులు కె.రాజేంద్రప్రసాద్, ఆర్.సుబ్బారావు, డి. సత్యనారాయణ, కె.ధర్మరాజు, ఎ.బాలయ్య, డి.నాగరాజు, టి.సతీష్, కె.సూర్యచంద్రరావు, ఎం. దుర్గారావు, బి.రాజు, పి.వెంకటరావు, పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

పంట కాలువ పూడికతీత పనులు

జేగురుపాడులో పంట కాలువల్లో పూడిక తీత పనులు

ప్రజాశక్తి - కడియం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయంతో రైతుల భాగస్వామ్యంతో పంట కాలువలో పూడిక తీత పనులు ప్రారంభం అయ్యాయి. రబీలో సాగు చేసేందుకు నీటి కొరత వెంటాడుతున్న తరుణంలో మండలంలోని పంట కాలువలో పెరిగి పోయిన తూటు, గడ్డి, వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో మండలంలోని మురముండ గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, రైతు అయినవిల్లి వెంకటేశ్వర్లు రైతుల సమస్యను చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రైతుల భాగస్వామ్యంతోపాటు, అందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించేందుకు అంగీకరించడంతో గురువారం మండలంలోని జేగురుపాడు గ్రామంలోని పంట కాలువలో పూడిక తీత పనులను ప్రారంభించారు. జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, ఏడిదసీతానగరం గ్రామాలకు సంబందించిన సుమారు 1700 ఎకరాల ఆయకట్టుకు నీటి ఎద్దడి తీరే అవకాశం వచ్చిందని, అందుకు సహకరించిన చందన నాగేశ్వర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

చెవిలో పూలు పెట్టుకుని నిరసన

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

దశాబ్దాల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చెవులో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మూడో రోజు సమ్మెలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు మున్సిపల్ కార్మికులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే, ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటే మున్సిపల్ కార్మికుల సేవలే కారణమని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాకా జగన్ మరిచి పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ సిఎంగా ఐదేళ్ల పాలన అనుభవించినా నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. తమ డిమాండ్ల పరిష్కారంలో తాత్సారం చేస్తే మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఎపిఎన్‌జిఒ సంఘ మాజీ నాయకుడు పెనుమక జయరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజన్న, అప్పారావు, మాండ్రు సుధీర్, మీసాల కిషోర్, మీసాల ప్రేమ్, వడ్డాది శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పెరవలి

స్థానికంగా కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ పక్కన నూతనంగా నిర్మించిన స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను గురువారం మండల అధ్య క్షులు బుద్ధణ లక్ష్మణరా వు అధ్యర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా పాలన సాగించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఐక్యతగా దేశసమైఖ్యతను కాపాడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెచ్చెట్టి కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణలో కాంగ్రెస్ నాయకులు

కార్టూ'నిజం'



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని ఫరిజిల్లిపేట గ్రామానికి చెందిన 186 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 31 లక్షల 75 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారునికే నేరుగా అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఒక్క అంగుళం భూమిని కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మభ్య పెట్టి, అధికార పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఏమీ చేయలేదు కాబట్టే ప్రస్తుత ప్రభుత్వంపై నిందలు వేసి ప్రజలను తప్పుదారి పెట్టేంచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి రాజశ్రీ, గ్రామ సర్పంచ్ ఉండమట్ల సత్యవతి,ఉండమట్ల రాజు, మండల కన్వీనర్ దూలం పెద్ద, మందారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, గండి నానిబాబు, కోలపాటి వెంకన్న, ఉండమట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందచేస్తున్న ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

కోర్టు ఆవరణలో రిలే నిరహారదీక్ష చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - నిడదవోలు

ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టం (యాక్ట్ 27/2023)ను రద్దు చేయాలని ప్రముఖ న్యాయవాది బయ్యే లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నిడదవోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణంలో 12వ రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో ప్రతిపక్షాలతో విస్తృతమైన చర్చలు జరపకుండా ఏకపక్షంగా ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టం వలన ప్రజలకు ఎంతో నష్టమని తెలిపారు. ఈ కార్యమంలో ఎన్‌విఎస్.రామచంద్రరావు, ఎం.రవికుమార్, ఎస్ కాశి, ఎండి మెహబూబ్, ఎం.అర్జునుడు, సిహెచ్ విజయ్ కుమార్, పి.సురేష్, ఎ.సతీష్ పాల్గొన్నారు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ట్యాబ్‌లు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పువ్వాడ సత్యమాంబ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ స్వామి నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాబ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోస్నా, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ టాబ్స్‌ను విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుని మరింత జ్ఞానం సంపాదించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ బి.సూర్య కుమారి, సరితా సోనీ, జడ్‌పిటిసి చల్లమళ్ళ వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి మదన్ మోహన్, సర్పంచ్ సంఘం సమాఖ్య అధ్యక్షులు కొండ్రపు ముత్యాలు, ఎంపిటిసి సభ్యులు అప్పలనాయుడు, ఆర్‌బికె ఛైర్మన్ తోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారా కేసులో రూ.25 వేల జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సారాయి కేసులో ముద్దాయి నుండి రూ.25 వేలు జరిమానా వసూలు చేసి గురువారం ప్రభుత్వానికి జమ చేసినట్లు కాకినాడ నార్త్ స్టేషన్ ఎస్ఇబి ఇన్స్పెక్టర్ కె.రామమోహనరావు తెలిపారు. మాధవపట్నం గ్రామానికి చెందిన నురుకుర్తి వెంకట లక్ష్మి పలుమార్లు సారాతో పట్టుబడగా ఆమెను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఆయన ఆదేశంతో ఆమె నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేసినట్లు వివరించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు దళిత కాలనీలో నత్తల మేరీకి చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైస్ ఎంపిపి కొరుప్రోలు కృష్ణ, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి దొరబాబు బాధితురాలిని పరామర్శించి బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

రాజా స్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక రాజా పబ్లిక్ స్కూల్లో పాఠశాల ఛైర్మన్ పి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యువి.శివ నాగబాబు పాల్గొని మాట్లాడారు. గోకవరంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజా పబ్లిక్ స్కూల్లో 44వ విద్య వైజ్ఞానిక ప్రదర్శలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విభిన్న ప్రాజెక్టులను వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదం చేస్తాయన్నారు. పాఠశాల సిబ్బంది ఎస్ఐ శివ నాగబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పిరమానాగమణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివరిస్తున్న దుర్గారావు

ప్రయోగశాల నుంచి పాఠశాలకు..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఎంఎస్‌సి విద్యార్థులు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె సూచనలను అనుసరించి ప్రయోగశాలలో నేర్చుకున్న ప్రయోగ ఫలాలను కళాశాల సమీపంలోని నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ ప్రయోగశాల నుంచి పాఠశాలకు కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షల ద్వారా రక్త గ్రూపులు, హెచ్‌బి శాతాలు మరియు అనీమియా గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో జంతుశాస్త్ర విభాగాధిపతి కె.దుర్గారావు, అధ్యాపక విద్యార్థులు, కెవివి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దేవరపల్లి

ఇల్లు దహనంతో కట్టుబట్టలతో మిగిలిన అగ్ని బాధితకుటుంబానికి జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు ఆర్థిక సాయాన్ని అందించారు. మండలంలోని సంగాయ గూడెంకు చెందిన తొర్లపాటి రాజు ఇల్లు దహనం అయ్యింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఆయన బాధితుడిని గురువారం పరామర్శించి ఇల్లు దహనం కావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన, టిడిపిల పక్షాన రూ.12 వేల నగదును బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు గణేష్, యాదవోలు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు అనిశెట్టి శ్రీను, సంగాయగూడెం సర్పంచ్ కరుటూరి శ్రీను, టిడిపి నాయకులు జుజ్జవరపు సూర్యచంద్రం, సోమిశెట్టి శ్రీను, కాటూరి సురేష్, తొర్లపాటి శ్రీను, సామిసెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - కడియం

గడప గడపకీ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు చెబుతున్న సమస్యలు పరిష్కారం కోసమే అభివృద్ధి పనులు చేబడుతున్నామని రాజమహేంద్రవరం రూరల్ వైసిపి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వైసిపి నాయకులు గిరిజాల బాబు, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, గ్రామ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీలతో కలిసి మండలంలోని వెంకాయమ్మ పేటలో వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే రానున్న రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, ఊటుకూరి శైలజ, బోడపాటి మూర్తి, కొత్తపల్లి శివాజీ, ఐతిరెడ్డి వెంకటస్వామి, దాసరి శ్రీనివాస్, గండీ రమణ, రంబాల దుర్గారావు, చప్పిడి రాంబాబు, పులిదిండి రాజు పాల్గొన్నారు.

పోరాటాలు... విజయాలు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పలు పోరాటాలు చేసింది. సామాజిక బాధ్యతగా ప్రజా సమస్యలపైనాస్పందించింది. రాష్ట్ర మహాసభలకు వచ్చిన పలువురు ప్రతినిధులు ఆయా జిల్లాల్లో జరిగిన పోరాటాలు, విజయాలు, ఎదుర్కొన్న నిర్బంధాలను ప్రజాశక్తితో పంచుకున్నారు. వాటిలో కొన్ని....

• నిర్బంధాన్ని ఎదుర్కొన్నా..

సంక్షేమ వసతిగృహాల్లో మెస్‌ఛార్జీలు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో 2023లో చలో కలెక్టరేట్‌ను నిర్వహించాం. ఈ సందర్భంగా పోలీసులు మమ్మల్ని లక్ష్యంగా చేసి లాఠీఛార్జి చేయడానికి ప్రయత్నం చేశారు. మెస్ ఎస్ఎ బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. జీపులో ఎక్కించి దాడి చేశారు. అప్పట్లో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. అక్రమ అరెస్టులపై, అణచివేత చర్యలను నిరసిస్తూ పోలీసుల తీరుపై ఆందోళన చేశాం. చివరకు జిల్లాలో ఉన్న అన్ని హాస్టల్ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నాయకులతో చర్చించి 167 సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగానే ఇవి పరిష్కారం అయ్యాయి. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తాం.

- ఎం.సౌమ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు, విజయనగరం జిల్లా

• జాబ్ క్యాలెండర్ పోరాటంలో లాకప్‌లో పెట్టారు

2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10 వేల పోస్టులతో జాబు క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఖాళీ పోస్టులు లక్షల్లో ఉండగా అరకొర ఉద్యోగాలు భర్తీ కోసం మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో నిరుద్యోగులంతా స్వచ్ఛందంగా ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐగా వారికి మద్దతు తెలిపాం. కలెక్టరేట్ వద్ద 3గంటల పాటు ధర్నా నిర్వహించాం. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశాం. గేట్లు తోసుకుంటూ వెళ్లి ఆందోళన ఉధృతం చేశాం. అయినా అధికారులు స్పందించలేదు. మరుసటి రోజు ఎంఎల్ఎకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్తుంటే దౌర్జన్యంగా పోలీసులు మమ్మల్ని అందరినీ ఈడ్చుకుని వెళ్లి అక్రమంగా అరెస్ట్ చేసి లాకప్ లో పెట్టారు. నిర్బంధాన్ని నిరసిస్తూ రెండో రోజు రాస్తారోకో ద్వారా పోలీసులు తీరును నిరసిస్తూ ఆందోళన చేశాం.

- అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

• ఎయిడెడ్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాం

2021-22లో భీమవరం డిఎన్ఆర్ ఎయిడెడ్ కళాశాల, నరసాపురం వైఎన్ ఎయిడెడ్ కళాశాలలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద పోరాటం తలపెట్టాం. దీంతో పోలీసులు విద్యార్థి సంఘం నాయకులతోపాటు 47 మంది విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయించారు. ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేశారు. అయినా వెనక్కి తగ్గకుండా ఉద్యమాన్ని సాగించాం. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఎయిడెడ్‌ను ప్రయివేటుపరం చేయడాన్ని నిలిపేసింది. అలాగే పెనుగొండ ఎస్‌వికెపి డిగ్రీ కాలేజీలో ఓ విద్యార్థి ఎన్‌సిసి శిక్షణకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. క్యాంపు నిర్వహకుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందడంతో ఎస్ఎఫ్ఐగా విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనలు చేపట్టాం. పోరాటం ఫలితంగా చివరకు మరణించిన విద్యార్థి కుటుంబానికి అధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

-టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, పశ్చిమగోదావరి

• హాస్టల్ భవనాల కోసం పోరాటం

2007లో ఏర్పడిన కృష్ణా యూనివర్సిటీ 2019 వరకు అద్దె భవనంలో నిర్వహించారు. సుమారు 5 వేలు మంది విద్యార్థులున్న ఈ యూనివర్సిటీకి 2019-20 మధ్యకాలంలో సొంత భవనాలను నిర్మించారు. అయితే వసతిగృహాలు నిర్మాణం చేపట్టలేదు. దాంతో ఎస్ఎఫ్ఐగా అనేక ఉద్యమాలు చేశాం. 2023 ఫిబ్రవరిలో ఎంసిఎ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇద్దరు మహిళా విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనంలో ఉండడం వల్ల కరెంటు షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. వారికి న్యాయం జరిగే వరకూ ఎస్ఎఫ్ఐ పోరాడింది. చలో యూనివర్సిటీ కార్యక్రమం ద్వారా అధికారులను కదిలించాం. చివరకు స్పందించిన యంత్రాంగం చర్చలకు పిలిచింది. అప్పటి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ సహా మిగిలిన నాయకులను పోలీసులతో విచక్షణారహితంగా దాడి చేయించారు. క్రూరంగా ప్రవర్తించారు. అయినా పోరాటాలను ఆపలేదు. చివరకు యూనివర్సిటీ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం మూడు నెలల క్రితం శంకుస్థాపన చేసింది. త్వరలో నిర్మాణ పనులు కూడా పూర్తయే అవకాశం ఉంది.

- సిహెచ్.రాజేష్, కృష్ణా యూనివర్సిటీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

• నాలుగు రోజుల పాటు నిరవధిక దీక్ష

వసతిగృహాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నాతో పాటు మరో ఏడుగురు నాలుగు రోజులు పాటు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టాం. రెండవ రోజు పోలీసులు దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. అక్రమంగా అరెస్టు చేసేందుకు అర్ధరాత్రి వచ్చారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. నాలుగు రోజుల దీక్షలు నేపథ్యంలో నిరసనలో ఉన్న వారి ఆరోగ్యాలు బాగా క్షీణించాయి. అయినా యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున విద్యార్థులతో చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చాం. ఆ కార్యక్రమాన్ని నిలుపుదల చేయించిన అధికారులు ఎస్ఎఫ్ఐ నాయకులను దీక్షలు విరమింపజేసి చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చారు. మా పోరాటం ఫలించింది.

- సామంతుల సమీర, ప్రొఫెషనల్ స్టూడెంట్స్ నెట్ వర్క్ కన్వీనర్, విజయనగరం జిల్లా

దుర్మార్గపు పాలనకు అంతం పలకాలి

ప్రజాశక్తి - గోపాలపురం

టిడిపిలో చేరిన వారితో మద్దిపాటి వెంకట్రాజు

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వ్యవస్థలన నిర్వీర్యం చేస్తూ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్న దుర్మార్గుడి పాలనకు రాబోయే ఎన్నికల్లో అంతం పలకాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. మండలం లోని జగన్నాథ పురంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కట్రగడ్డ సురేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని 2, 3, 4, 6 వార్డులకు చెందిన బిజెపి సభ్యులు జగన్నాధపురం ఉపసర్పంచ్ పసుమర్తి వీరరాఘవులు (బొజ్జా), కరుటూరి వెంకట బులిరాజు, పాలడుగుల చిన్నమ్మ, పెనుబోయిన వెంకటలక్ష్మి, యండ్రపల్లి సత్యనారా యణ, ఈడ్చిన లక్ష్మణరావు, వాలంటీర్‌గా పనిచేసి రాజీనామా చేసిన అంగారపు దుర్గారావుతోపాటు మరో 40 మంది టిడిపిలో చేరారు. వారికి మద్దిపాటి వెంక ట్రాజు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట రాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపించగల సత్తా చంద్ర బాబుకు మాత్రమే ఉందన్నారు. వాలం టీర్లు, ఆశాలు, అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసిన జగన్‌కి రానున్న రోజుల్లో ఓటమి తప్పదన్నారు. ఈ.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆర్.సత్య నారాయణ, నాయకులు పి.పెద్దబ్బులు, కొర్లపాటి రాము, యండ్రప్రగడ మంగరావు, జ్యేష్ఠ శ్రీను, ముత్యాల రాయుడు, గన్నిన మురళి, గమిడి రాఘవులు, కొడూరి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకూ పోరాడతాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న సిపిఐ మధు

ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీని అమలు చేసేంత వరకూ పోరాటాన్ని సాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగులు హెచ్చరించారు. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద జరుగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరహారదీక్ష గురువారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామేమి గొంతమ్మ కోర్కెలు కోరడం లేదని, ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీనే అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల చేస్తున్న సమ్మెకు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎవరి ప్రమేయం లేకుండానే కడుపుకాలి సమ్మెలోకి వచ్చారని అన్నారు. తక్షణం సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ బే షరతుగా రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు జరిగేంత వరకు పోరాటం నిర్వహించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు సేపని రమణమ్మ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ నాయకులు ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద్, పూసలరావు, వెంకట్, ఆర్.వెంకట్రావు, ప్రవీణ్, మోహిని, హైమవతి, నిర్మల జ్యోతి, ప్రియదర్శిని, దుర్గ, కోటేశ్వరి, స్వప్నతదితరులు పాల్గొన్నారు.

సిఎంకు అంగన్‌వాడీల పోస్టు కార్డులు

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ వివిధ రూపాల్లో నిరసనలను వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు గురువారం సిఎం సారూ..మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి' అంటూ పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసన శిబిరాల్లో రిలే నిరహార దీక్షలను కొనసాగించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం గత 17 రోజులుగా పోరాడుతున్న అంగన్‌వాడీలు జగన్‌కు అక్క, చెల్లెమ్మలు కాదా? అని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబిరాణి ప్రశ్నించారు. ఇదే వైఖరితో ప్రభుత్వం వ్యవహరిస్తే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సబ్ కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో లక్ష మంది అంగన్‌వాడీలు తమ సమస్యల కోసం పోరాడుతుంటే ఎన్నికల ముందు అక్కచెల్లెమ్మలని సంబోధించిన పెద్దమనిషికి అంగన్‌వాడీల అక్క, చెల్లెమ్మల ఆందోళన కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, యూనియన్ నాయకులు కె.సునీత, రామలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. **తాళ్లపూడి** సిఎం సారూ..అంగన్‌వాడీలకు మీరు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి' అంటూ తాళ్లపూడి మండల అంగన్‌వాడీలు గురువారం పోస్ట్ కార్డులతో తమ నిరసన వ్యక్తం చేశారు. 17వ రోజు సమ్మెలో భాగంగా తాళ్లపూడి మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద అంగన్‌వాడీల పోస్ట్ కార్డు రాస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఉద్యమాన్ని విరమించేది లేదని అన్నారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరం మానవహారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైఖరిని ఖండించారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.విజయ్‌కుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, ఎస్.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు. **రాజానగరం** స్థానిక సాయిబాబాబు గుడి సమీపంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజాను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు ఎం.మార్తమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.విజయ, యు.విశాలి, సత్యనారాయణమ్మ, గంగ, మాధురి పాల్గొన్నారు. **పెరవలి** స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పెరవలి ప్రాజెక్ట్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు పాల్గొని సిఎంకు రాసే పోస్టు కార్డులో రాసిన డిమాండ్స్‌ను వివరించారు. అనంతరం ఆయా పోస్టు కార్డుల ను పోస్టు బాక్సుల్లో వేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సూర్యాకాంతం. మేరీ విక్టోరియా పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరహారదీక్ష కొనసాగింది. నిరసన శిబిరం నుంచే సిఎంకు పోస్టు కార్డులను రాసి పోస్టు బాక్స్‌ల్లో వేశారు. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాలతి, విజయకుమారి, భాస్కరం, ధర్మ కుమారి పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** 'మా మొర వినండి..మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి' అంటూ అంగన్‌వాడీలు సిఎం జగన్‌కు పోస్టు కార్డుల ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మాణిక్యంబ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి అమ్మ ఒడి కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్‌విఎల్. పుష్పావతి, బి.పద్మజ, ఎ.నరసమాంబ పాల్గొన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు పి.నాగేశ్వరరావు, సిహెచ్.రమేష్ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. **కడియం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ఉద్యమానికి ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా ఎక్కువ వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చి, నేడు ఆ మాట తప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో కడియం ఎంపిపి ఎలుగుబంటి ప్రసాద్, ఎలుగుబంటి నాని, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మా మొర ఆలకించండి సిఎం సారూ అంటూ అంగన్‌వాడీలు పోస్టు కార్డుల ఉద్యమాన్ని నిర్వహించారు. సిఎం సారూ...ఎన్నికల ముందు మాకు ఇచ్చిన హామీని అమలు చేయండి సారూ అంటూ పోస్టుకార్డులపై రాసి పోస్టుబాక్సుల్లో వేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.రత్నాజీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.పద్మ, కామేశ్వరి, కె.గంగ భవాని, టిపి.లక్ష్మి, కె.నర్సమ, ఉండవల్లి అనసూయ, కె.కాంతాకుమారి, పి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన

కడియంలో అంగన్‌వాడీలకు మద్దతు ఇస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల, మాజీ ఎంఎల్‌సి అంగర

దేవరపల్లిలో పోస్టుకార్డుల ఉద్యమంలో అంగన్‌వాడీలు

30న నన్నయలో మిల్లెట్స్‌పై వర్క్ షాప్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 30వ తేదీన "మిలెట్స్ ఫర్ హెల్త్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్" అనే అంశంపై వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నామని విసి ఆచార్య కె.పద్మ రాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ - 2023' సందర్భంగా గోదావరి రీజనల్ క్లస్టర్ గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారంతో నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిలెట్స్‌పై వర్క్ షాప్ నిర్వహి స్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో .హార్టికల్చర్ యూనివర్సిటీ విసి డాక్టర్ తోలేటి జానకిరామ్, జెఎన్‌టి యుకె విసి ఆచార్య జివి ఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్స్ ఆచార్య జి.సుధాకర్, డాక్టర్ బి.శ్రీనివాసులు, సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ పాల్గొంటారని చెప్పారు. ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి.తారసత్యవతి మిలెట్స్ యొక్క ప్రాధాన్యతను వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, ఆచార్య పి.సురేష్ వర్మ, డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ కె. నూకరత్నం పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం జడ్‌పి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి, పాఠశాల హెచ్‌ఎం ఇవిఎస్ ఆర్ఎన్‌డి.ప్రసాద్ గురువారం ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంటి మాట్లాడుతూ మేధస్సును పెంపొందించుకునేందుకు ట్యాబ్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. నాడు- నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జి. వెంకటేశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ పడాల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింక్ దస్తావేజు పోయినది

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వరరావు, డోరునెం.1-21 ఉసులు మర్రు గ్రామం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివశిస్తున్న నా యొక్క **1558/2004 తేది.7-5-2004** నెంబర్లు గల లింక్ దస్తావేజు ది.**20-12-2023**వ తేదీన నేను ఇల్లు మార్చుకొన్న సందర్భంలో ఉసులు మర్రు మార్గం మధ్యలో పడిపోయినది. ఎంతవెతికినా కనిపించలేదు. కనుక పై నెంబరు గల లింక్ దస్తావేజు ఏవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వరరావు
డోరునెం.1-21, ఉసులుమర్రు గ్రామం,
తూర్పుగోదావరి జిల్లా. సెల్: 9154634219

బాలోత్సవ నిర్వహణకు కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి - దేవరపల్లి

బాలోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మండల బాలోత్సవ కమిటీ సమావేశం గురువారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో కమిటీ అధ్యక్షులు, మానవత రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం దేవరపల్లి మండలంలో బాలోత్సవాలు నిర్వహించినందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి ప్రశంసలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం 2024 జనవరి 5 తేదీ నిర్వహించే రెండో బాలోత్సవాలకు అన్ని విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్కూల్‌లో రిజిస్ట్రేషన్ కమిటీ, అకాడమిక్, సంస్కృతిక, ఈవెంట్‌లో కమిటీలు, జడ్జిలు కమిటీ, బహుమతులు కమిటీ, భోజనాలు ఏర్పాటు కమిటీ, మరియు నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా బాలోత్సవ గౌరవ సలహాదారులు వై.పైడియ, ఎంపి స్పోర్ట్స్ అధారిటీ మాజీ ఆఫీసర్ పేరం రవీంద్ర మాట్లాడుతూ ఈ సంవత్సరం 1 తరగతి నుంచి 5 తరగతి వరకు బాల బాలికలకు రన్నింగ్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా బాలోత్సవ కమిటీ కార్యదర్శి జిఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 40 చోట్ల బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.వెంకట రామారావు, వి.కృష్ణారావు, నారాయణ విశ్వేశ్వర రావు, వై.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఎ. సుభాష్ చంద్రబోస్, ఎన్.లలిత, ఎన్.రామారావు, జలజాక్షి, ఎం.పోసిరత్నం, పి.రహిత తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గోపాలపురం

పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

తుఫాను కారణంగా పొగాకు పంటలలో వచ్చే తెగుళ్ళ నివారణ చర్యలు చేపట్టాలని టుబాకో బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య సూచించారు. గురువారం గోపాలపురం టొబాకో బోర్డ్ అధికారులు, సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు, పలు కంపెనీల ప్రతినిధుల బృందం చిన్నాయగూడెం, యాదవోలు, వెదుళ్ళ కుంట, వాదాలకుంట, కోమటికుంట గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో నల్లకాడ, మాడు మచ్చ, మొక్క ఎండిపోవడం, ఆకు ముడత, బొబ్బ తెగులు వ్యాపించినట్లు గమనించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొగాకు తోటలు, పంట యొక్క ఎదుగు దలలో ఉన్న లోపాలను గుర్తించామని, నల్లకాడ, మానుమచ్చ తెగుళ్ళకు రెడోమిల్ 20 గ్రాములు పది లీటర్ల నీటిలో కలిపి తెగులు నివారణకు వాడాలని తెలిపారు. ఆకు ముడత, రసం పీల్చు పురుగుల తెగుళ్ళకు నివారణకు కాన్ఫిడర్ 2.5 ఎం.ఎల్ పది లీటర్ల నీళ్లలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ పి.ప్రేమస్మిత, సిటిఆర్ఐ శాస్త్రవేత్త సుబ్బ య్య, జె.రఘురామ ప్రసాద్, కె.శ్రీధర్ రెడ్డి, కె.కళ్యాణ్, కేవల్ రామ్ మీన, ఎ.శ్రీనివాస్, రైతు సంఘం అధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్ పాల్గొన్నారు.

సామర్లకోట పురపాలక సంఘం
ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఒ.సి. నెం. 557/2023-ఇ1 తేది.28-12-2023

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘ నిధులు (2020-21), జిజిఎమ్‌పి నిధులు మరియు జనరల్ నిధులతో ఎస్టిమేట్ కాంట్రాక్టు విలువ రూ. 33.26 లక్షలుతో 10 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది : ది. 29-12-2023 ఉదయం గం|| 10.30ల నుండి
2. టెండర్లు స్వీకరణకు ముగింపు తేది : ది.05-01-2024 సాయంత్రం గం|| 5.00ల వరకు

తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in నందు 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చు.

సం/- **కమిషనరు**
సామర్లకోట పురపాలక సంఘం